# ఆలయ చరిత్ర

కాకతీయ చరిత్రలో నేడు వరంగల్ అని వ్యవహరింపబడుతున్న ఓరుగల్లుకు ఒక విశిష్టత ఉన్నది. 800 సంవత్సరాలకు పూర్వం యావత్తు త్రిలింగ దేశము మాత్రమే కాక అటు తంజావూరు, మహారాష్ట్ర, కర్ణాటక ప్రాంతాల వరకు విస్తరించిన కాకతీయ సామ్రాజ్యాన్ని ఏకఛత్రాదిపత్యంతో పరిపాలించిన కాకతీయ చక్రవర్తులకు ఇది రాజధాని. కాకతీయుల శాసనాలలోను, సమకాలీన సాహిత్యంలోను అది ఏకశిలానగరమని కన్పిస్తుంది. దాని తెనుగీకరణమే ఓరుగల్లు.

కాకతీయులు ప్రధానంగా శివారాధకులు. వారు, వారి సామంతులు ఎన్నో శివాలయాలను కట్టించారు. విచిత్రమేమిటంటే ఎవరు దేవాలయాన్ని కట్టిస్తే వారు ఆ ఈశ్వరునికి తమ పేర్లనే తగిలించారు. హనుమకొండలో రుద్రదేవుడు ప్రతిష్టించిన ఈశ్వరుడు రుద్రేశ్వరుడు (వేయిస్తంభాలగుడి) పిల్లల మర్రిలో నామిరెడ్డి ప్రతిష్టించిన ఈశ్వరుడు నామేశ్వరుడు, ఎకసానమ్మ ప్రతిష్టించిన ఈశ్వరుడు ఎకేశ్వరుడు. బేతరాజు ప్రతిష్టించిన ఈశ్వరుడు, బేతేశ్వరుడు. ప్రోలరాజు ప్రతిష్టించిన ఈశ్వరుడు ప్రోలేశ్వరుడు.

కాకతీయులు శివారాధకులే అయినా, వారు అందరు దేవతలనూ సమానంగా పూజించారు. ఈశ్వరుని ఆరాధించినట్లే అమ్మవారిని కూడా వివిధ రూపాలలో అర్చించారు. వారి శక్త్యారాధనకు నిదర్శనాలు ఆనాటి సాహిత్యంలోను శిల్పంలోను కనిపిస్తాయి. కాకతీయ చరిత్రకు ప్రామాణికంగా తీసుకోదగిన గ్రంథాలలో ముఖ్యమైనవి రెండు. అవి:1. ఏకామ్రనాథుని "ప్రతాపరుద్ర చరిత్రము" (క్రీ.శ.1550-1600): 2. కాసె సర్వప్ప వ్రాసిన "సిద్ధేశ్వర చరిత్రము" (1600 ప్రాంతం) ఈ రెండు గ్రంథాలు కాకతీయ సామ్రాజ్యపతనాంతరం దాదాపు 150-200 సంవత్సరాలకు వ్రాయబడినవి. అంటే కాకతీయ సామ్రాజ్యం పతనమైనప్పటికీ, కాకతీయ వైభవము కాలగర్భంలో కలిసిపోకముందే వ్రాయబడినది. మరొక గ్రంథం ప్రతాపరుద్రుని ఆస్థాన కవియైన విద్యానాధుడు వ్రాసిన "ప్రతాపరుద్రీయమ్" (క్రీ.శ. 1300 ప్రాంతం) ఈ మూడింలోని విషయాలను సమన్వయించి చూస్తే కాకతీయులు శక్త్యారాధకులని స్పష్టమవుతుంది.

ప్రతాపరుద్ర చక్రవర్తి దిగ్విజయయాత్రకు బయల్దేరేముందు తమకు "అభిమానదేవత"యైన దుర్గాదేవిని పూజించి హనుమకొండ వెలుపలనున్న తోటలో సేనలను విడిది చేసినట్లు ప్రతాపరుద్రీయంలో వర్ణించబడింది. ఆంధ్ర ప్రతాపరుద్ర యశోభూషణము(పు.237) అట్లాగే కాకతీయ ఆరాధ్య దేవతయైన కాకతమ్మ దుర్గాదేవియే అని కూడా చెప్పబడింది. అంతేకాక ఆనాటి శిల్పాలలో కూడా దుర్గాదేవి విగ్రహాలు చాలా కనపడతాయి. ఆమె సింహవాహినిగాను, మహిషాసురమర్దిని గాను శిల్పాలలో కన్పిస్తుంది. ప్రతాపరుద్ర చరిత్రలో (పు.24) హనుమకొండ నుండి ఓరుగల్లు కోటలోని స్వయంభూ దేవాలయం వరకు ఉన్న రెండు క్రోసుల మార్గంలో రెండు ప్రక్కలలోను వందల దేవాలయాలను ప్రోలరాజు కట్టించినట్లు చెప్పబడింది. సిద్ధేశ్వరచరిత్రలోను (పు.90) ఈ విషయమే చెప్పబడింది.

అదీకాక కాకతి ప్రోలరాజు క్రీ.శ. 986లో ఓరుగల్లు పట్టణాన్ని నిర్మించిన తరువాత అది అభేద్యంగా ఉండానికి కాళేశ్వరం నుండి శ్రీ రామారణ్యపాదుల వారిని పిలిపించి వారిచే "శ్రీ విద్యాక్రమంబను యంత్ర ప్రకారంబుగా" కోటను రేఖలు వ్రాయించి ప్రహారిగోడ క్టించినట్లు ప్రతాపరుద్ర చరిత్ర (పు.24) లో చెప్పబడింది. ఈ విషయము సిద్దేశ్వర చరిత్ర (పు.96)లో కూడా కన్పిస్తుంది అట్లాగే కాకతీయ శిల్పాలలో చాలా చోట్ల సింహవాహినియైన దుర్గ, మహిషాసురమర్దిని వెండి విగ్రహాలు కన్పిస్తాయి. అంతేకాక కాకతీయ దేవాలయాలలో ప్రసిద్ధములైన వేయిస్తంభాలగుడి, రామప్ప దేవాలయములలో అవి తలపిస్తాయి. కనుక కాకతీయులు శక్త్యారాధకులనుటలో సందేహం లేదు. అలాంటి దేవీశక్తులలో శ్రీ భద్రకాళిదేవి ఒకటి.

ఓరుగల్లు ప్రజలకు ఇలవేల్పుగా నేటికీ విరాజిల్లుతున్న శ్రీ భద్రకాళిమాత దేవాలయము కాకతీయుల కాలం నాటికే ప్రాభవంలో ఉండినట్లు తగిన ఆధారాలు కన్పిస్తున్నాయి. ప్రతాపరుద్ర చరిత్రలోను (పు.1), సిద్ధేశ్వర చరిత్రలోను (పు.158), భద్రకాళీదేవి ప్రస్తావించబడింది. హిడింబాశ్రమము (నేటి మెట్టుగుట్ట)కు ఈశాన్య భాగంలో హనుమద్గిరి (నేటి హనుమకొండ) ఉన్నదని దానికి పూర్వభాగంలో 'భద్రకాళీదేవి' ఉన్నదని వర్ణింపబడింది. ఆ తల్లి నేటికి అదే పేరుతో పిలువబడుతున్నది. అంతేకాక సిద్ధేశ్వర చరిత్రలో (పు.24) 'భద్రేశ్వరి' అనే పేరు కూడా కన్పిస్తుంది.

**ఆలయ నిర్మాణము:** శ్రీ భద్రకాళి ఆలయము క్రీ.శ. 625లోనే నిర్మింపబడినదని శాసనం ద్వారా తెలుస్తుంది. వేంగీ రాజ్యము జయింపనరుగు చాళుక్య చక్రవర్తి రెండవ పులకేశి ఈమెను దర్శించి వేంగిని జయించినట్లును, అనంతరం అమ్మవారి అనుగ్రహంతో అర్థ సిద్ధిబడసి క్రీ.శ. 625 ప్రాంతంలో ఈ ఆలయాన్ని నిర్మించాడు. అందుకు ఆధారం - అమ్మవారి విగ్రహం ఒక పెద్ద ఏకాండశిలమీద ఉండటమే. రెండవది- ఈ ఆలయ నిర్మాణానికి నిలిపిన మూలస్తంభాలు చతురస్రాకారంలో ఉన్నాయి. కాకతీయుల స్తంభ విన్యాసం వర్తులాకారంలో కన్పిస్తుంది. ఈ కారణాల వల్ల ఈ దేవాలయం చాళుక్యుల కాలంలో నిర్మింపబడిందని చెబుతారు.

అయితే ఆలయ స్తంభాలు చెక్కిన విధానము, ఆ స్తంభాలను నిలబెట్టిన విధానము, విశాలమైన ముఖద్వారము- అన్నీ కాకతీయుల శైలిలోనే కన్పిస్తాయి. కనుక కాకతీయుల కాలంలో నిర్మింపబడిందేనని కూడా అనిపిస్తుంది. అంతేకాక- భద్రకాళి గుడిలోని అంతరాళస్తంభాలలో ఒకదాని మీద : "మహేశశ్చారు సంధత్తే మార్గణం కనకాచలే మంత్రి విర్థన ఎఱ్ఱస్తు మార్గణే కనకాచలమ్॥ అనే శ్లోకం కన్పిస్తుంది. ఈ శాసనపాఠం పురాతత్త్వ శాఖవారు ప్రచురించిన వరంగల్ జిల్లా శాసనాలలో (పు.307)ఉన్నది. ఈ శ్లోకంలోని ఎఱ్ఱన క్రీ.శ. 10వ శతాబ్దిలో కాకతిపురమును పాలించినట్లు గూడూరు శాసనమును బిట్టి తెలుస్తున్నది. ఈయన తండ్రి వితనామాత్యుడని, ఆయనకు మీసరగండడనే బిరుదు ఉండేదని ఈ శాసనాన్ని బట్టి తెలుస్తుంది. ఇదే విషయము భద్రకాళి దేవాలయంలోని మరొక స్తంభం మీద కూడా కొంచెం బేధంతో ఉన్నది. అది "మంత్రిమీసరగండేన, వితనామాత్య సూనునా! ఎరయాఖ్యేన సమోదాతా, నభూతో న భవిష్యతి!!" అనే శ్లోకం ఈ రెండు స్తంభశాసనాలను బట్టి ఈ దేవాలయం క్రీ.శ.10వ శతాబ్దంలో నిర్మింపబడి ఉంటుందని ఊహించవచ్చును. లేదా కాకతి ప్రతాపరుద్రుని సర్వ సైన్యాధిపతియైన ఆడిదం మల్లుకు కూడా మీసరగండడనే బిరుదు కన్పిస్తుంది. కనుక ప్రతాపరుద్రుని కాలంలో నిర్మించబడిందో లేదో సరిగ్గా చెప్పలేము. గణపతిదేవ చక్రవర్తి కాలంలో వితనామాత్యుని కొడుకైన ఎరయాఖ్యుడు ఆలయ పార్శ్వంలో తటాకాన్ని త్రవ్వించి, ఆలయానికి కొంత భూదానం కూడా చేసినట్లు శాసనము ద్వారా తెలుస్తున్నది. కనుక ప్రతాపరుద్రుని కాలంలో నిర్మించబడిందో లేదో సరిగా చెప్పలేము. ఏది ఏమైనప్పికి కనీసం వెయ్యి సంవత్సరాల చరిత్ర గలది ఈ భద్రకాళి దేవాలయము. ప్రతాపరుద్రుని కాలానికే ఆమె భక్తులకు కొంగు బంగారమై కోర్కెలను తీరుస్తూ ఉండినట్లు ఆ రెండు గ్రంధాలలోను కన్పిస్తుంది. ఒకనాడు సుదర్శనమిత్రుడనే పండితుడు నూరుగురు విద్వాంసులు కొలువగా ఏనుగు మీద ఎక్కి ఏకశిలానగరానికి వచ్చి ప్రతాపరుద్రుని కొలువు చూడానికి వెళ్ళి అక్కడి విద్వాంసులతో వాదించానికి వచ్చానని చెప్పాడట. అది విన్న విద్వాంసులు అతనిని అవమానపరచి పంపివేశారు. దెబ్బతిన్న సుదర్శనమిత్రుడు, ఆ విద్వాంసులను కారుమాటలతోనైన జయించాలనే ఉద్ధేశ్యంతో "ఈ వేళ కృష్ణచతుర్ధశి, రేపు అమావాస్య మీరు కాదంటారా?" అని ప్రశ్నించాడట విద్వాంసులు ఇరకాటంలో పడ్డారు. ఎందుకంటే 'ఔనంటే' సుదర్శనమిత్రుని వాదం అంగీకరించినట్లు అవుతుంది. కాదంటేనే అతనిని ఓడించినట్లవుతుందని నిర్ణయించి, "రేపు పౌర్ణమి" అని వాదించారట. విద్వాంసులు గెలవాలంటే మార్నాడు పౌర్ణమి కావాల్సి ఉండింది. ఈ సంకట స్థితి నుంచి తమను రక్షించమని మల్లిఖార్జున భట్టు ఆ రాత్రి హనుమకొండకు వెళ్ళి భద్రకాళి దేవిని పూజించి ఆ దేవిని 11శ్లోకాలతో స్తుతించాడట. సంతుష్టురాలైన ఆ తల్లి ప్రత్యక్షమై- "నీ మాటలే నిలుపుతా" నని వరమిచ్చిందట.

మరునాటి రాత్రి నిండు పున్నమిలాగా వెలుగొందిన చంద్రుని చూసి, సుదర్శన మిత్రుడు క్షమాపణ వేడుకొన్నాడట. ఇది కేవలం దైవీశక్తి కాని, మానుషశక్తి కాదని అంగీకరించి వెళ్లిపోయాడట. ఆ విధంగా భద్రకాళిదేవి భక్తులను కటాక్షించటం ఆనాటి నుంచే కన్పిస్తుంది. ఈ వృత్తాంతంలో పేర్కొనబడిన శాఖవెల్లి మల్లిఖార్జున భట్టు ప్రతాపరుద్రుని ఆస్థానంలోనివాడు. కనుక ప్రతాపరుద్రుని కాలం నాటికే భద్రకాళి గుడి ప్రసిద్ధమై ఉండినట్లు స్పష్టమవుతుంది.

క్రీ.శ. 1323లో కాకతీయ సామ్రాజ్య పతనానంతరం ఈ దేవాలయం ప్రాభవం కోల్పోయినట్లు కన్పిస్తుంది. శేషించిన కొంచము 1523లో తళ్లికోట యుద్ధముతో ఉత్సన్నమై పోయింది. సుమారు 1000 సంవత్సరములకు పైగా ఎంతో వైభవము ననుభవించిన ఈ దేవాలయము నామమాత్రావశిష్టమైనను అమ్మవారి మహిమ మాత్రము నివురుగప్పిన నిప్పువోలె నుండి లోకమును రక్షించుచునే ఉన్నది. అదీకాక హైదరాబాద్ సంస్థానంలో సాగిన గోల్కొండ నవాబుల పాలన, రజాకార్ల దుశ్చర్యల ఫలితంగా దాదాపు క్రీ.శ. 1948 వరకూ ఈ దేవాలయం పునరుద్ధరణకు నోచుకోలేదు.

కాకతీయ సామ్రాజ్య పతనానంతరం భారతదేశానికి స్వాతంత్ర్యం వచ్చేవరకూ కూడా ఈ తెలంగాణ ప్రాంతం మతాంతరుల పాలనలోనున్నది. ఈ ఆలయము ఉపేక్షింపబడినది. భారతదేశానికి స్వాతంత్ర్యం సిద్ధించిన పిమ్మట తెలంగాణ ప్రాంతం భారతదేశంలో విలీనమ్మైన తదుపరి వితరణశీలురైన పురజనుల సహకారముతో ఈ ఆలయము తన పూర్వ వైభవమును సంతరించుకున్నది.

అమ్మవారి నాలుక వ్రేలాడుతూ భయంకరంగా ఉండేదని అంటారు. ప్రాచీనకాలంలో కూడా అట్లాగే భయంకరంగా ఉండేదనడానికి- "తనరుభద్రేశ్వరి యనంగ భయదంబుగాగ" అన్న సిద్ధేశ్వరచరిత్ర (పు.24) లోని మాటలే నిదర్శనము! అటువంటి భీకరమైన ముఖం ప్రసన్నంగా మారిందని చెబుతారు. దక్షిణాచార సంప్రదాయం ప్రకారము అర్చింపబడే మూర్తి శాంత స్వరూపంగా ఉండాలనేది శాస్త్ర విధి. అమ్మ వారి ముఖం ప్రసన్నంగా మారడానికి అదీ కూడా ఒక కారణం కావచ్చు. ఈ ఆలయంలో వైదిక, స్మార్త ఆగమ పద్ధతిని పురస్కరించుకొని దక్షిణాచార శాక్తాద్వైత సంప్రదాయముల మేరకు పూజారాధనలు జరుగుతాయి.

1948 నాటికే శ్రీ అమ్మవారి శక్తులను గురించి రకరకాల కథలు ప్రచారంలో ఉండేవి. అమ్మవారి గుడిలో విగ్రహం క్రింద ధనరాశులు ఉండేయనే నమ్మకంతో అర్ధరాత్రి వేళ త్రవ్వి ధనాన్ని దొంగలించాలని ప్రయత్నించిన ఒకవ్యక్తి కొంత దూరం వెళ్ళగానే రక్తం కక్కుకొని చనిపోయినట్లు చెప్పుకునే వారు. అలాంటి రోజులలో, భయంకరమైన సర్పాలు, ఏగోలాలు సంతరిస్తున్నప్పికి "జగద్రక్షకియైన ఆ అమ్మవారే తమను కాపాడుతుంది" అన్న విశ్వాసంతో అక్కడే ఉంటూ, తన తుదిశ్వాస వరకు అమ్మవారిని సేవిస్తూ ఈ దేవాలయాన్ని దినదినాభివృద్ధి చేస్తూ ఈనాటికి ఒక దివ్యక్షేత్రంగా తీర్చిదిద్దిన ఘనత అమ్మవారి ఉపాసకులు, ఆలయ వ్యవస్థాపక ధర్మకర్త కీ.శే. శ్రీ బి.ఎస్.గణేశశాస్త్రి గారికి దక్కుతుంది. ఇందుకు అనేకమంది ఉపాసకులు, దాతలు, అధికార, అనధికార ప్రముఖులు మరియు సకలజనులు అందించిన సహకారం ఫలితంగా ఈనాడు భద్రకాళీ దేవస్థానం, తెలంగాణలోని ప్రధాన దేవాలయాలలో ఒకటిగా విరాజిల్లుతుందనడంలో అతిశయోక్తిలేదు.

గర్భాలయానికి రెండు వైపులా రెండు చిన్న గదులు ఉన్నాయి. అవి బహుశః యోగులో సిద్ధులో తపస్సు చేసుకోవానికి ఉపయోగించేవేమో అనిపిస్తుంది. మహామండపంలో దక్షిణం వ్కెపున నున్న ఒక శిలమీద చెక్కిన పార్వతీపరమేశ్వరుల విగ్రహాలు ఉన్నాయి. ఈ విగ్రహాలు భద్రకాళీ అమ్మవారు ఉన్న భూమితలముతో సమానంగా ఉండటం వలన ఇవి కూడా ప్రాచీనకాలపువే

అనిపిస్తుంది. అదికాక ఇక్కడ ఈశ్వరుడు లింగరూపంలో కాక పార్వతీ పరమేశ్వరుల రూపంలో ఉండటం విశేషము. శివపార్వతులిద్దరినీ ఒకేరాతిలో చెక్కిన ఉమామహేశ్వర విగ్రహాలు కూడా కాకతీయ శిల్పాలలో కన్పిస్తాయి. అమ్మవారి దేవాలయానికి దక్షిణ భాగాన ఒక గుహ ఉన్నది. అందులో యోగులు తపస్సు చేసుకుంటూ ఉండేవారని ప్రతీతి. అమ్మవారి గుడికి వెళ్ళేదారిలో, చెవు ప్రక్కన ఉండిన ఒక పెద్ద గుట్ట మీద గణపతి విగ్రహం ఒకి ఉండేది. గుట్టతో పాటు అది కూడా అంతరించి పోయింది.

1986లో దక్షిణ భారత దేవాలయాల సంప్రదాయానికి అనుగుణంగా ఆలయ శిఖరం, మహామండపం, శాలాహారాదులు నిర్మింపబడినవి. శ్రీ భద్రకాళీదేవి విగ్రహం దాదాపు 9 అడుగుల ఎత్తు 9 అడుగుల వెడల్పుతో కన్నులపండువగా అలరారుతూ భక్తులను కాంక్షిస్తూ కన్పిస్తుంది. అమ్మవారు ప్రేతాసనాసీనయై ఉన్నది. ఆమె 8 చేతులలో- కుడివైపు ఉన్న నాలుగు చేతులలో ఖడ్గము, ఛురిక, జపమాల, ఢమరుకము ఎడమవైపు ఉన్న నాలుగు చేతులలో ఘంట, త్రిశూలము, ఛిన్న మస్తకము, పానపాత్రలు ఉన్నాయి. అమ్మవారు పశ్చిమాభిముఖంగా ఉన్నది. ఆలయం ముందుభాగంలో మహామండపం ఒకటి విస్తారంగా నిర్మించబడినది. అందులో ధ్వజస్తంభము, సింహవాహనము, బలిపీఠము, సుబ్రహ్మణ్యేశ్వరుడు, ఆంజనేయస్వామి ప్రతిష్టలు ఉన్నాయి. ఇటీవలనే ఆలయమునకు నైరుతి భాగములో శ్రీ వల్లభ గణపతి దేవాలయం, యాగశాల మరియు పవిత్రపరిక్రమ కూడ భక్తులచే నిర్మింపబడినది.

ఓరుగల్లు నగరం నడిబొడ్డున ఉన్నప్పటికీ, ప్రధాన రహదారికి ఒక కిలోమీటరు దూరంలో గుట్టల నడుమ ఎదురుగా జలసంపదతో కళకళలాడే భద్రకాళి చెరువుతో, ప్రశాంతమైన వాతావరణంలో నెలకొని ఉన్న ఈ దేవాలయం ఈనాడు నిత్యనూతనంగా విరాజిల్లుతున్నది. ప్రతినిత్యము జరిగే ధూపదీప నైవేద్యాదులు కాక- ప్రతి సంవత్సరమూ ఆశ్వయుజ మాసంలో శరన్నవరాత్రులు, చైత్రమాసంలో వసంతనవరాత్రులు ఎంతో వైభవంగా జరుగుతున్నాయి. ఆషాఢ మాసంలో పౌర్ణమి నాడు అమ్మవారిని ‘శాకంభరి’గా అలంకరిస్తారు. ఆనాడు రకరకాల కూరగాయల దండలతోశోభిల్లే అమ్మవారి రూపం మాటలకు అందనిది.

**శాకంభరి:** పూర్వము హిరణ్యాక్షుని వంశంలో దుర్గముడనే వాడొకడు పుట్టాడు. వాడు పరమరాక్షసుడు. అతనికి ఒక దురాలోచన వచ్చింది అది - వేదాలను అపహరిస్తే వాటి బలంతో బ్రతుకుతున్న దేవతలు నశిస్తారని వెంటనే హిమాలయ పర్వతాలకు వెళ్ళి వెయ్యి సంవత్సరాలు ఉగ్ర తపస్సు చేశాడు. బ్రహ్మ ప్రత్యక్షమై వరం కోరుకొమ్మన్నాడు. వెంటనే దుర్గముడు - బ్రాహ్మణుల దగ్గర ఉన్న వేదములు, వేద మంత్రములు తనకు కావాలని, దేవతలకు అపజయం కలగాలని కోరుకున్నాడు. సరే అన్నాడు బ్రహ్మ, వేదాధ్యయనము, జపహోమాదులు వదలివేశారు బ్రాహ్మణులు, హోమాదులు మానివెయ్యటం వలన తమకు అందవలసిన హవిర్భాగములు అందక, దేవతలు శక్తి హీనులయ్యారు. యజ్ఞాలు, తపాలు, జపాలు లేక ప్రకృతి ధర్మం నశించింది. వానలు కురువలేదు. పంటలు పండలేదు. అనావృష్టివలన పశుపక్ష్యాదులు, మనుష్యులు ప్రాణాలు వదిలారు. భూమి మృతకళేబారలతో దుర్భరం అయింది. ఆ సమయంలో బ్రాహ్మణులు హిమవత్పర్వతానికి వెళ్ళి ఆ పరాశక్తిని ప్రార్థించారు. అమ్మవారు కరుణించి తొలకరి మబ్బు వంటి శరీరఛాయ, నూరుకన్నులు, కోటి సూర్యుల దివ్యతేజస్సు లోకోత్తరమైన లావణ్యములతో ప్రత్యక్షమైంది. ఆ తల్లి చేతులలో మధుర రస భరితముల్కైన ఫలాలు, రకరకాల భక్ష్య భోజ్య పదార్థాలు ధరించి ఉండింది. ఆమె కండ్లు పూర్ణకుంభాల్లాగా ఉండినాయి. ఆ కండ్లనుంచి 9 రోజులు ఏకధారగా కారిన నీటితో ఓషధులన్నీ జీవకళతో ఒప్పినాయి. నదీనదాలు, చెరువులు జలసమృద్ధములయ్యాయి. జగత్తు చల్లబడింది. ఆమె శరీరం నుండి ఫలశాక సమూహములు, అన్న పానామృతములు ఆవిర్భవించి లోకంలోని కరువు రూపు మాపబడింది. కనుక ఆమె ‘శాకంభరీ’ అని కీర్తింపబడింది (శ్రీదేవి భాగవతం సప్తమ స్కంధం). ఆ దేవి

అనుగ్రహించిన 9 రోజులను 'శాకంభరీ' నవరాత్రులుగా పూజ చేస్తున్నారు. వసంత శరన్నవరాత్రులతోపాటు, ఆషాఢ మాసంలో 15 రోజులపాటు, మాఘ మాసంలోను 4 నవరాత్రులు ఈ దేవాలయములో అనుష్ఠింపబడుతాయి. ఇవి కాక ఎన్నో విశేష పూజలు నిర్వహింపబడుచున్నవి.

చైత్రేశ్వినే తథాకషాఢే మాఘే కార్యో మహోత్సవః చతుర్షు నవరాత్రేషు విశేషాత్ఫలదాయకః॥
(దేవీ భాగవతం)

ప్రతి సంవత్సరం శ్రీ కృష్ణ జన్మాష్టమి రోజున రాత్రి అమ్మవారు శ్రీ కృష్ణుడి రూపంలో అలంకరించబడి పూజింపడుతుంది. (గోప్త్రీ గోవింద రూపిణీ-లలితా సహస్రనామముం మామేవ పౌరుషం రూపం గోపికా జనమోహనం॥ - దేవీభాగవతం)

వైశాఖ శుద్ధ పంచమి "శంకర జయంతి" రోజున శ్రీ భద్రకాళీభద్రేశ్వరుల కళ్యాణోత్సవాలు (బ్రహ్మోత్సవాలు) దేదీప్యమానంగా జరుగుతాయి. ప్రస్తుతం ఆసేతు హిమాచలము శివకళ్యాణము మహాశివరాత్రి పర్వదినమున కాని, ఆ మరునాడు లేదా ఆ ముందు రోజు గాని జరుపబడుచున్నవి. కాని కాళికాపురాణములో

శ్లో॥ సమయం కారయామాస వివాహాయ హరో గిరిం। మాధవేమాసి పంచమ్యాం సితేపక్షే గురోర్దినే॥

చంద్రే చోత్తర ఫల్గున్యాం భరణ్యాదౌ స్థితే రవౌ॥ (అధ్యా.44 శ్లో॥40-41)

అను ప్రమాణములవలన శివుడే స్వయముగా నిర్ణయించిన శివకళ్యాణ ముహూర్తము అనగా వైశాఖ శుద్ధ పంచమి నాడు శివకళ్యాణము చేయుట ఉత్తమోత్తమమని తెలియుచున్నది. అవైదిక నాస్తిక సిద్ధాన్త కలుషితమైన భారతీయ సంస్కృతిని ఉద్ధరించుటకై శంకరుడు అపరశంకరులుగా అవతరించుటకు తన కళ్యాణ దివసమును ఎన్నుకొనుటలో పరమార్థము శివకళ్యాణము విశ్వకళ్యాణ ప్రదమనుటయే. బ్రహ్మోత్సవములలో కళ్యాణోత్సవము అంతర్భాగమైయుండుట సాంప్రదాయమైనందున పై ప్రమాణములననుసరించి వరంగల్ శ్రీ భద్రకాళీ దేవస్థానమునందు అమ్మవారి కళ్యాణోత్సవములు శాస్త్రవిధిననుసరించి ప్రతి సంవత్సరం వైశాఖ మాసమునందే నిర్వహింపబడుచున్నవి.

మహాష్టమి (దుర్గాష్టమి) రోజున జగదంబ శ్రీ భద్రకాళీ రూపములో అవతరించినదని శాస్త్రములు చెబుతున్నాయి.

శ్లో॥ తత్రాష్టమ్యాం భద్రకాళీ దక్షయజ్ఞవినాశినీ। ప్రాదురూతా మహాఘోరా యోగినీకోటిభిఃసహ॥

అతోకర్థం పూజనీయా సా తస్మిన్నహని మానవైః॥ త్రిసన్ధ్యం పూజయేద్దేవీం జపస్తోత్ర పరాయికణః॥

మహాష్టమ్యాం భగవతీ భద్రాయామపి పూజితా। దదాతిచాయురారోగ్యం యతో భద్రాస్వరూపిణీ॥

ఆశ్వినస్యసితేపక్షే యాతు స్యాత్ తిథిరష్టమీ। తస్యాం రాత్రౌపూజనీయా మహావిభవవిస్తరైః॥

అహం భద్రాచ భద్రాకహం నావయోరన్తరం క్వచిత్। సర్వసిద్ధిం ప్రదాస్యామి భద్రాయామర్చితాప్యహం॥

మహాష్టమి అని పిలువబడుచున్న దుర్గాష్టమి రోజున జగన్మాత కోటి యోగినీ గణములతో భద్రకాళీరూపముతో ఆవిర్భవించినదని పై శాస్త్ర వచనములు తెలుపుచున్నవి. అట్టి అమ్మవారు ఈ భూమండలము నందు అవతరించి ఉన్న స్థానము వరంగల్ నగరము అయిఉండుట నగరము యొక్క గొప్పతనమును చెప్పకనే చెబుతున్నది. కావుననే దుర్గాష్టమి నాడు దేశదేశాల ప్రజలు అమ్మవారిని దర్శించుటకు వరంగల్ నగరమునకు విచ్చేయుదురు. ఇందుకు పురశ్చర్యావర్ణవములోని పై శ్లోకములే ఆధారం.

గత 70 సంవత్సరాలుగా ఆలయమునందు చేపట్టబడిన పునరుద్ధరణ నిర్మాణ కార్యక్రమములు పూర్తి అయిన పిమ్మట దక్షిణామ్నాయ శృంగేరి శ్రీ శారదాపీఠాధీశ్వరులు జగద్గురు శంకరాచార్య అనంతశ్రీ విభూషిత శ్రీశ్రీ భారతీతీర్థమహాస్వామి వారి కరకమలములచే దివి.04-01-2013 రోజున 'మహాకుంభాభిషేకము' అత్యంత వైభవోపేతముగా జరుపబడినది. అట్టి సందర్భములో జగద్గురువులు ప్రసన్నవదనము కలిగిన అమ్మవారిని, ఈ దేవాలయ విశిష్టతను గూర్చి చేసిన అనుగ్రహ భాషణము భక్తులను ఆనందపరవశులను చేసినది. శ్రీచరణుల ఆనాటి అనుగ్రహ భాషణమును ఒక ప్రబంధమని చెప్పుకొనవచ్చును.

సుఖసంతోషాలలోను, కష్టసమయాలలోను శ్రీ భద్రకాళీ మాతను సేవించి భక్తులు నివృతిని పొందుతున్నారు. ఇంతకాలానికి దాదాపు 700 సంవత్సరాలకు తిరిగి ఈ ఆలయం ప్రాచీన వైభవాన్ని సంతరించుకొన్నది. కులమత బేధాలు లేకుండా అన్ని జాతులవారు వచ్చి, అమ్మవారిని దర్శించి, సేవించి ఆమె అనుగ్రహానికి పాత్రులవుతున్నారు. ఈనాడు భక్తజనులకు ఇలవేల్పుగా, ఆరాధ్యవైవంగా విలసిల్లుతున్న ఆ తల్లి అనుగ్రహానికి అందరం పాత్రులమవుదాం.